

## తెనాలి సుశీలాదేవి

లాడ్జిలో రూం దొరకటం నాకు గొప్ప రిలీఫ్ కలిగించింది.

అప్పటి వరకు కలిగిన విసుగుని పోగొట్టుకోటానికి బాత్‌రూంలో దూరాను. షవర్‌కింద సీటితుంపరల మధ్య ఒళ్ళంతా హాయిగా అనిపించింది. మనసు తేలిగ్గా.... మూదిపింజలా....

అప్పటిదాకా నాకు కలిగిన చికాకుకి కారణం నా ప్రయాణంలో కలిగిన అవరోధమే.

అసలు ప్రయాణం మొదలు పెట్టినప్పుడు సంతోషంగా బయలుదేరాను. కారణం.... మూడు రోజుల సెలవుకోసం పడరాని పాట్లు పడుతున్నాను ఆఫీసులో. ఇన్స్‌పెక్షన్ వుంది, వీల్లేదు, అంటూ ఆఫీసరు వాయిదాపేస్తూ వచ్చాడు. వున్నట్టుండి యిన్స్‌పెక్షన్ వాయిదా పడటంతో హఠాత్తుగా నాకు లీవు శాంక్షనయింది.

యిక మామయ్యకి వుత్తరం వ్రాసి, ఆయన వచ్చి.... యిదంతా మూడు రోజుల్లో ముగిసేపని కాదనిపించి చెప్పా పెట్టకుండా నేనే బయలుదేరాను పెళ్ళి చూపులకి. పెళ్ళిచూపులకంటూ వెడితే ముందుగా డేట్ యిచ్చి వెళ్ళకూడదని, హఠాత్తుగా వెళ్ళాలని, అప్పుడే వాళ్ళ పరిస్థితులు, మనస్తత్వాలు బాగా తెలుస్తాయని నా నమ్మకం.

కానీ అది మర్యాద కాదని మామయ్య పడనీలేదు.

యీసారి అవకాశం దానంతటదే తన్నుకొచ్చింది. హఠాత్తుగా లీవు శాంక్షన్ కావటంతో ఎవరికీ తెలియపరచటానికి టైంలేక బయలుదేరి వెళ్ళిపోయానని చెప్పేయవచ్చు.

అసలే పెళ్ళిచూపులు రెండు నెలల నుంచీ వాయిదా పడుతూనే వుంది. మామయ్య పెళ్ళికూతురివాళ్ళ అడ్రసు యిస్తూ, పిల్ల బావుంటుందనీ, ఏమంత వున్నవాళ్ళు మాత్రం కాదనీ వుత్తరం వ్రాసి, వారం రోజులు సెలవు పెట్టి వస్తే యిద్దరూ వెళ్ళి చూసిరావచ్చుననీ వ్రాసి రెండు నెలలవుతుంది. తరువాత వారం, పదిరోజులకు ఒక వుత్తరం చొప్పున ఆయన వ్రాస్తున్నా నాకే లీవు దొరకలేదు. తీరా దొరికాక నేనొక్కడినే వెళ్ళి రావాలనిపించింది.

యిక్కడిదాకా ప్రయాణం బాగానే జరిగింది. తీరా యీ వూళ్ళోకి ప్రవేశిస్తున్నామనంగా బస్సు చెడిపోయింది. ఆ రిపేరు, రిపేరు మూడు గంటల పాటు సాగి సాయంత్రం నాలుగ్గంటలకు చేరాల్సిన బస్సు ఏడుగంటలకు చేరుకుంది.

నేను వెళ్ళాల్సిన వూరు అక్కడనుండి మరో బస్ ఎక్కి పది కిలోమీటర్లు వెళ్ళాలి. ఆ వేళప్పుడు వెళ్ళి అడ్రస్ వెతుక్కుంటూ పోవడం అంత బావుండదనిపించి రిక్షావాడిని పట్టుకుని మంచి లాడ్జికి తీసుకువెళ్ళమన్నాను.

యిదీ కథ.......

ఆలోచనలు ముగిసేసరికి అంతసేపు స్నానంలో తల దిమ్మెక్కినట్టు అనిపించింది.

బాత్‌రూంలోంచి బయటపడి.... అద్దంముందు అలంకారాలన్నీ ముగించుకుని బెడ్‌మీదకు చేరి ఒక్క సిగరెట్ వెలిగించేసరికి.... ఓహ్ తనువూ, మనసూ కూడా ఒక రసమయ జగత్తులోకి తేలిపోయి........

"సార్! మీకు భోజనం...."

హోటల్ కుర్రాడి రాకతో భావనా ప్రపంచం లోంచి బయటపడ్డాను.

భోజనం వద్దని, బ్రెడ్, పాలు తీసుకు రమ్మని డబ్బులిచ్చి కుర్రాణ్ణి పంపించి.... గది కిటికీలోంచి లోపలికి చొచ్చుకు వస్తున్న లేత వెన్నెల చాలాకు సొంత

దారుని చూడటానికి కిటికీ దగ్గరకు వెళ్ళాను.

నీలాకాశంలో చిరునవ్వుల చంద మామ....

రేపు నే చూడబోయే అమ్మాయి యిలా అలరిస్తుందా నా మనసును....?

ఏమో....

"సార్...."

ఉలిక్కిపడ్డాను. ఆ పిలుపు హోటలు కుర్రాడిది మాత్రం కాదు. ఆడగొంతు.

చప్పున వెనక్కి తిరిగాను. నా కళ్ళు ఆశ్చర్యంతో నిండుకున్నాయి.

'ఎంతందంగా వుంది— ఛుప్' నా గుండెలనే నొక్కి పెట్టేశాను.

ఫామిలీ గర్ల్‌లా వుంది. పొరపాటున తన రూం అనుకుని........

తికమకలోంచి బయటపడి రెండు గుటకలు మింగి.... అడిగాను.

"ఏం కావాలండీ...."

"మీకు నేను కావాలా?"

బిత్తరపోయాను. నా మెదడు ఒక్క క్షణం మొద్దుబారిపోయింది. నేను అడిగిం దానికి ఆమె యిచ్చింది సమాధానమా.... నేను సమాధానం చెప్పవలసిన తిరుగు ప్రశ్నా?.... తెప్పరిల్లుకోటానికి కొన్ని క్షణాలు పట్టింది.

"ఏమన్నారు...." నా గొంతులో కంపరం నాకు తెలీకుండానే.

"మీకు నేను కావాలా...." అదే సమాధానం.... అది ప్రశ్న కూడా.

'మంచినీళ్ళు కావాలా' అన్నంత తేలికగా అడుగుతోంది.

నేను జవాబు చెప్పాలి.... ఏమని? ఏమని?....

నా కిలాంటి అలవాట్లు లేవు. అసలు యిలాంటి అనుభవం తగల్లేదేనాడూ....

"క్షమించండి. నే నలాంటి వాడిని కాను...." అన్నాను గొంతు పెగల్చు కుని. అన్నక్షణంలో నన్ను నేను తిట్టు కున్నాను 'క్షమించండి' అని ఎందు కన్నానా అని.

నా మాట పూర్తయిన క్షణంలో చివ్వున వెనక్కి తిరిగింది. ఆ విసురుకు త్రాచుపాము లాంటి బారెడు జడ ఒక్క సారి ముందుకు వెళ్ళి నడుమును చుట్టు కుని వెనక్కి వచ్చి ఆ నడుంమీద....

"ఆగండి"

తలుపు దాటి అడుగేయబోయిన ఆ అమ్మాయి క్షణం ఆగి తలమాత్రం వెనక్కి తిప్పి సూటిగా నా కళ్ళలోకి చూసింది 'ఏమిటన్నట్టు'.

ఎందుకాగమన్నానో నాకే తెలిదు. కాని అనేశాను. తప్పదు.

రమ్మన్నట్టు తల వూపాను.

తలుపులు దగ్గరగా మూసి నాలుగడు గులు ముందుకు వచ్చింది.

"మీ పేరేమిటో తెలుసుకోవచ్చా...." సర్వసాధారణంగా అడిగాను.

అరక్షణం చూసిన ఆ కళ్ళలో నిరాశ, నిర్లిప్తత....

తల వంచుకుని నెమ్మదిగా అంది.

"క్షమించండి. నాకున్న టైం చాలా తక్కువ. కాని ఆ కాలానికున్న విలువ మాత్రం ఎంతో ఎక్కువ. మీ ప్రశ్నలకు సమాధానం చెప్పే వ్యవధి నాకు లేదు. నేను మరొకర్ని వెతుక్కోవాలి."

చివరి మాటలు పలికేటప్పుడు ఆ తీయని గొంతు బొంగురుపోయిందా అని పించింది నాకు.

మాటలు ముగించిన మరుక్షణం గిర్రున వెనక్కి తిరిగింది.

"ఆగండి! మీకున్న అతి తక్కువ కాలానికి మీరంటున్న ఎక్కువ విలువ ఎంతో తెలుసుకోవచ్చా...."

అప్రయత్నంగా అన్నాను. వ్యంగ్యం ధ్వనించింది కాబోలు, ఆ చూపులు వాడిగా గుచ్చుకున్నాయి.

తడబడ్డాను ఒక్క క్షణం.... సంబా ళించుకున్నాను.

"మరేంలేదు. ఆ విలువెంతో నే నిచ్చుకుంటాను. మీరు మరొకర్ని వెతుక్కోనక్కరలేదు. అందుకని...."

ఆ కళ్ళు వెలిగాయి దీపాల్లా. కాంతి పరుచుకుంది ముఖం నిండా.

ఇంతలో........

బ్రెడ్, పాలు పట్టుకుని కుర్రాడు వచ్చాడు.

"వచ్చావాక్కా...." వాడి ముఖంలో సంతోషం.

నిజానికి యిలాంటివారిపట్ల హోటల్ కుర్రాళ్ళు ఎంతో అమర్యాదగా ప్రవర్తి స్తారు. కాని యిక్కడ....

చిరునవ్వు నవ్వింది ఆ అమ్మాయి. బిగించిన పెదాల మాటున ఆ నవ్వు బుగ్గలలోకి జారపడి సొట్టలు పడేలా చేసింది.

చూస్తున్న కొద్దీ ఒక్కో అందం బయటపడుతోంది.

నడకలో.... మాటలో.... విసిరే చూపులో....అరవిరిసే చిరునవ్వులో....

యీ అందం ఎందుకిలా బజారుపా లయింది? ఏ ఒక్కరి స్వంతమో అయి వుంటే.... మరింత నిగ్గుతేరి....'

"నాకున్న సమయం చాలా తక్కువ" తలవంచుకుని నెమ్మదిగా.... నమ్రతగా అంది. హోటల్ కుర్రాడు వెళ్ళి పోయాడు. తలుపులు మూసి గొళ్ళెం పెట్టివున్నాయి."కూర్చోండి...."అన్నాను మంచానికి ఒకవేపు జరిగి రెండోవేపు చూపుతూ. కాళ్ళు కిందకు వ్రేలాడేసి, ఒక చెయ్యి పక్కమీద మోపి.... మరో చేతితో చెంపలు నిమురుకుంటూ పక్క వాటుగా కూర్చుంది.

నిగ్రహం ప్రదర్శిస్తున్నట్టు కనబడు తోంది గాని సమయం గడిచిపోతుందే త్వరగా వెళ్ళాలన్న తొందర ఆ కళ్ళల్లో .... ఆ కదలికల్లో....

"ఆ.... యిప్పుడు చెప్పండి మీ పేరే మిటి!" అన్నాను, తీరుబడిగా వెనక్కి దిండుకు చేరగిలబడి.

"అంటే………" ఆశ్చర్యంగా చూసింది.

ఆ కళ్ళలో కనబడే ప్రతి భావం ఎంతందంగా వుంది. యీ అందమంతా యిలా….

"అంటే…. మీరు…. నన్ను…." నా మౌనాన్ని భంగపరుస్తూ రెట్టిస్తున్నట్టుగా అంది.

"నాకు అలాంటి అలవాటు లేదు. యిం పోతే మీకున్న విలువైన సమయానికి తగ్గ వెల యిచ్చుకుంటానని మిమ్మల్ని వుండమన్నది మీతో కాసేపు మాట్లాడదామని మాత్రమే. మీ ఖరీదు మీకు ముట్టుతున్నపుడు యిందుకేం అభ్యంతరం వుండదు కదూ" సాధ్యమయినంత అనునయంగానే అన్నాను.

అయినా…. ఎందుకో…. వంచిన ఆ కనురెప్పలు తడుస్తున్నాయా అని పించిందొక్క క్షణం.

యిద్దరి మధ్య కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

"నాతో ఏం మాటలుంటాయి…." ఆ కంఠం కొద్దిగా గద్గదికంగా తోచింది.

"నీ పేరు…వూరు…యింత అందం… సౌకుమార్యం…. యిలా అమ్ముకోవాల్సిన కారణం….యిలాగే…కొన్ని…."

నా మాటలు పూర్తి కానేలేదు. చప్పున దోసిట్లో ముఖం దాచుకుంది.

అదిమిపెట్టుకుంటున్న దుఃఖం. భుజాలు ఎగిరెగిరి పడుతున్నాయి.

చటుక్కున ఆ అరచేతులు తొలగించి ముఖం పైకి ఎత్తాను. మందారాల్లా అరుణిమ దాల్చి నిండి తొణుకుతున్న చెరువుల్లా వున్నాయి కళ్ళు.

"ఎందుకు…. ఎందుకిలా…. నేనేమయినా తప్పుగా మాటాడానా…." మార్దవంగా అడిగాను.

అసలు నాకే ఆశ్చర్యంగా వుంది. నేను వచ్చిన పనేమిటి? శుభ్రంగా పడుకుని నిద్రపోయి తెల్లారి లేచి నా దారిని నేను పోక యీ…. తతంగమంతా



తలకు చుట్టుకుని….

'ఛీ….ఛీ…. అట్లా అనుకోకూడదు. ఈ అమ్మాయిని చూడగానే ఎందుకో జాలివేసింది. యింత అందం ఎందుకిలా బజారుపాలు చేస్తోందా అని కనుక్కోవాలన్న ఆసక్తి దానికి తోడయింది. యిందులో తప్పేముంది?

"నా మాటలు మిమ్మల్ని నొప్పించి వుంటే నన్ను క్షమిం……"

తన అరచేత్తో చప్పున నా పెదవులు మూసింది. అంతే వేగంతో చేతిని వెనక్కి తీసుకుంది, తప్పు చేసినట్టుగా.

'నా కలవాటు లేదు' అని నేనన్న మాట స్ఫురించివుంటుంది కాబోలు.

"మీ రడిగిన దాంట్లో తప్పేం లేదు. కాని నన్ను యింతవరకు అలా అడిగిన వాళ్ళు లేరు. నా అందాన్ని పొగుడుతూ, నాతో పొందే సుఖానికి లొట్టలువేస్తూ…. యింతవరకూ అలాంటివాళ్ళే తటస్థపడ్డారు. కాని 'నీ వెవరు? నీ పేరు…. వూరు…. అడిగి…. అయినా వాటితో ఎవరికి అవసరం? తాము వెచ్చించే డబ్బులు ప్రతి పైసాకు సుఖం జుర్రుకోవాలనే తపన తప్ప యిట్లాంటి పిచ్చి పిచ్చి ప్రసంగాలతో కాలాన్ని ఎవరు వృథాపుచ్చుతారు? ఈనాడు కొత్తగా…. మీ మాటలు…. ఎంతో ఆత్మీయంగా…. నా హృదయపు అట్టడుగు పొరల్ని స్పృశించి, అక్కడ ఘనీభవించుకుపోయిన ఆవేదన తాలూకు స్మృతుల్ని కదిలించి…. కరిగించి…. అందుకే…. అందుకే…. ఏడ్చాను…." అంది కంపిస్తున్న పెదవులతో. నిశ్శబ్ద తరంగాలుగా పొర్లి వస్తున్న వేదనని అణుచుకోడానికి ఆ అమ్మాయికి కొంత టైం పట్టింది.

యిలోగా నే నామెను, ముఖ్యంగా ప్రతి కోణంలోనూ ప్రస్ఫుటమయ్యే ఆ అందాన్ని పరిశీలించసాగాను.

'ఇంతకు ముందెప్పుడయినా యింత అందమైన అమ్మాయిని చూశానా? ఉహూ. ఎక్కడా చూసిన జ్ఞాపకం లేదు. నాకు వర్ణించడానికి తెలీదు గానీ తెల్లగా, నాజూగ్గా, అందంగా…. తెల్లని సిల్కు చీరెలో…. ఒకే ఒక్క మాటలో చెప్పాలంటే ప్రాణం పోసుకొచ్చిన 'బాపుబొమ్మ.'

పొడవైన ఆ జడ నడుముని చుట్టుకుని వచ్చి ఆమె ఒడిలో కుప్పలా….

"మీ రేమనుకోకపోతే……" ఆ పెదవులు సన్నగా కదిలాయి.

"అడగండి" అన్నాను.

"నా పేరు, వూరు తరువాత చెబుతాను. ఇక నా కథంటారా. ఎన్నో సినిమాల్లో, ఎన్నో పత్రికల్లో యిలాంటి

పాత్రలు కోకొల్లలు. నా గురించి చెప్పుకోటం మొదలుపెడితే ముందుగా ఏడుపే వస్తుందేమో.... అందుకని.... అందుకని.... మీ గురించి చెప్పండి. ముందుగా. ఒక కొత్త కథ వింటాను. నాకూ కథ చెప్పేవాళ్ళున్నారన్న ఆనందంలో నా కథ చెప్పడంలో గల బాధను కొద్దిగా తగ్గించుకోగలనేమో...."

ఎంత చిన్నకోరిక. కాని అది తీర్చితే తనకు కలగబోయే ఆనందం విలువ రెండు మాటల్లో చెప్పేసింది....

"అలాగే! నా సంగతే చెబుతాను. నా పేరు రాజేంద్రప్రసాద్." ఆగాను.

ఉలిక్కిపడింది. గమనించాను.

"ఏదేం! నా పేరు చెప్పగానే తృళ్ళి పడ్డారు. ఆ పేరుతో మీ కెవరయినా పరిచయం...."

"లేదు.... లేదు...మీరు చెప్పండి...."

"స్టేట్‌బ్యాంక్‌లో ఆఫీసరుగా వుద్యోగం చేస్తున్నాను. మా వాళ్ళంతా నేను పని చేస్తున్న వూరికి చాలా దూరంగా పల్లెటూళ్ళో పొలాలు చూసుకుంటూ, సొంత యింట్లో హాయిగా కాలుమీద కాలు వేసుకుని కూర్చుని సుఖపడ్తున్నారు. నేను మాత్రం సత్రం భోజనం, మఠం నిద్ర అన్నట్లు హోటల్లో వుప్పూకారం లేని సాంబారు అన్నం తింటూ, గదితీసుకుని వుంటున్నాను. యిట్లా హోటలు సాపాటుతో చప్పబడిపోతాననే భయంతో మా వాళ్ళు నన్నో యింటివాడినిచేయదల్చి.... అంటే యిల్లు కట్టించి నన్ను సొంత దారుని చేయడం కాదండోయ్........ పిల్లని తెచ్చి నా మెడకి కట్టి...." ఆపేశాను.... రెప్పవేయకుండా అలాగే చూస్తుండిపోయాను.

నవ్వుతోంది....పకపకా.... ఆపుకోలేకుండా........ క్షణాల్లో తన బాధంతా మరిచిపోయిందా....

వాన కురిసిన రాత్రి తరువాత సూర్యోదయం లాగా ఆ ముఖంలో సరి కొత్త చైతన్యం. నవ్వి....నవ్వి అలసిపోయి.... సర్దుకుని....

"అబ్బ.... ఎన్నాళ్ళకి నవ్వాను నేను. నాలో యింకా పకపకా నవ్వగల పసితనం వుందన్న సంగతి యిప్పుడే తెలుస్తోంది. భలేగా.... ఎంత తమాషాగా మాట్లాడగలరు మీరు. మీకు, మీ మాటలకు చాలా థ్యాంక్స్. నే నింకా నవ్వగలుగుతున్నాను, నేను నవ్వటం మరచిపోలేదు. ఓహ్...."

తన సంతోషాన్ని ప్రకటించటంలో నా చేతులు పట్టుకుని వూపేసింది. నేను మౌనంగా ఉద్రేకంగా తననే చూస్తుండటంతో చప్పున చేతులు వదిలేసి....

"సారీ".... అంది తప్పుచేసినట్టుగా.

"అయ్యో. నా దగ్గరన్నీ ప్యాంట్లు, షర్టులు తప్ప శారీలు లేవుగదండీ" అన్నాను అమాయకంగా.

సెలయేరు గలగల అలలు అలలుగా సాగి.... అలసిపోయి....

"రాజేంద్రప్రసాద్‌గారూ.... చాలా రోజుల తర్వాత.... నన్ను నేను మరచిపోయేంతగా.... నాలో వేదననేదే లేదనేంతగా....నన్ను నవ్వించేస్తున్న మీ ఋణం...."

వెంటనే అనేశాను. "నా కడుపున పుట్టి తీర్చుకుంటానని మాత్రం అనబోకండి. నేను కనలేను...." భయం నటించాను.

'బాబోయ్.... నవ్వలేక యిక నా పొట్ట చెక్కలయ్యేలా వుంది. హాస్యం మానేసి మామూలుగా చెప్పండి సార్ మీ గురించి" నవ్వును అదిమిపెట్టుకుంటూ అంది. ఆ కళ్ళుమాత్రం నవ్వుతూనే వున్నాయి.

"అలాగే! ఎంతవరకు చెప్పాను..... ఆ.... మా వాళ్ళు నన్నో యింటివాడిని చేసి, కాస్త వుప్పూకారం తగిలేలా వండిపెట్టగల పిల్లకోసం వెతికి వేసారిపోతున్నారు. కుంభకర్ణుడి చెల్లెల్లా ఎక్కడ పడి నిద్రపోతుందో మరి.... యింతవరకు తగల్లేదు."

ఆశ్చర్యంగా చూసింది నా కేసి.

'ఏమిటన్నట్టు' కళ్ళెగరేశాను.

"మీవాళ్ళు, మీకు అమ్మాయికోసం వెదకి వేసారిపోతున్నారా.... యింత అందంగా వున్నారు. ఆఫీసరు వుద్యోగం చేస్తున్నారు. ఆడపిల్లల తండ్రులంతా మీ యింటిముందు క్యూలో వుండాల్సింది కట్నాల మూటలు చేతుల్లో పట్టుకుని...."

"ఆ....అదే....అదే.... పాపం చాలా మందే వచ్చారనుకో.... మూటలు కూడా బాగా బరువుగానే వున్నాయి....కాని.... కోతిని.... కొండముచ్చును చేసుకునే ధైర్యం నాకే లేకపోయింది...."

"అంటే అమ్మాయిలు అందంగా లేరంటారా...."

"బాగానే వున్నారు వాళ్ళంతా.... కాని పగలు చూస్తే రాత్రి కల్లోకి వచ్చి భయపెట్టే ఆ విగ్రహాలని ఆ మూటల బరువుకోసం ఒప్పుకోలేకపోయాను. నా గుండె చాలా బలహీనం మరి...."

"అయితే అందమైన అమ్మాయిలే రాలేదంటారా.... లేక అలాంటి అమ్మాయిలు మీకు తగినంత కట్నం యిచ్చుకోలేకపోయారా...."

"ఆ.... యిక్కడ యింకో సంగతి చెప్పడం మరిచాను.... మీరు ఆదర్శం అనండి మరేదన్నా అనండి. అంత పెద్ద ప్రయోగాలు నేను మాత్రం చేయను. కాలేజీలో వరకట్న దురాచారం మీద ఉపన్యాసాలు దంచి, వ్యాసాలు వ్రాసి వ్రాసి, కనీసం అన్ని వ్రాసి, దంచినందుకు ఎవరూ వినకపోయినా దంచిన నేనయినా ఆచరించాలని కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. కాని...."

"కాని.... అంటూ అంత విచారంగా ముఖం పెట్టారేం.... ఆ మాటతో మీ

యింటిముందు తిరణాలులా సాగి వుంటారు ఆడపిల్లలు, వాళ్ళ తల్లి దండ్రులూ.... కాదూ...."

"అయ్యో, పిచ్చిపిల్లా.... 'వరుడా! నీ వెల ఎంత?' 'మనిషివా? సంతలో పశువ్వా' అంటూ వ్యాసాలు వ్రాసి.... పత్రికల్లో పేర్లు చూసుకుని మురిసి పోటమేగానీ సొంతబుద్ధి వుందంటారా యీ ఆడపిల్లలకి. 'కట్నం తీసుకోనట అనగానే' బాబోయ్ యింత ఆస్తి, అందం, ఆఫీసరు వుద్యోగం వున్నవాడు కట్నం వద్దంటున్నాడంటే ఏదో వుంది. వీడిలో ముదిరిపోయిన రోగమో.... బయటకి చెప్పుకోలేని లోపమో....' నని తిరిగి కూడా చూడలేదు. ఆఖరుకు ఓ అమ్మాయి ఎదురుగా అడిగేసిందికూడా 'కట్నం లేకుండా చేసుకుంటే మీలో ఏం లోపంవున్నా రచ్చకెక్కకుండా నోరుమూసుకు పడివుంటుందనే కదూ' అని. 'నేను కట్నం తీసుకోను' అనటం కూడా ఒక డిస్క్వాలిఫికేషన్ అని నాకు అప్పుడే బాగా అర్థమైంది.

"నాకు ఆశ్చర్యంగా వుంది...." కళ్ళింత చేసుకుని అంది.


"అవును, వినేవాళ్ళకు అలాగే వుంటుంది.... అనుభవించేవాళ్ళకు కదా తెలిసేది."

"అయితే ఆ దెబ్బతో యిక అదర్శాన్ని మూటగట్టిపారేసి కట్నాల మూటెక్కేశారన్నమాట."

"యింకా ఎక్కలేకపోతున్నాను. నా మాట నిలబెట్టుకోవాలనే చూస్తున్నాను. ఈ సారయినా ఫలితం దక్కుతుందో లేదో.... ఆ.... నా గొడవతోనే సరిపోయింది. మీరు భలేవారే. మీ గురించి ఒక్కమాట చెప్పలేదు...." కళ్ళలోకి గుచ్చి చూస్తూ అడిగాను.

"చెబుతాను. ఒక్క ముక్కేమిటి. మీ రిచ్చిన స్నేహపూర్వకమైన స్వాంతనతో నా గుండెల్లో యిన్నాళ్ళూ కరడు

టపాకాయలకి భయపడి మూలనక్కావా ఛ ఛ........
నాన్నారితో బాంబులు కాల్పించుకుందువుగాని పదపద!




గట్టుకుపోయిన వేదన కరిగి కరిగి.... మాటల రూపంలో ప్రవహించి........ మిమ్మల్ని ముంచేయదూ.... యింతకూ మీ పెళ్ళిచూపు లెక్కడ? అమ్మాయి ఎవరు?"

తెలుసుకోవాలన్న కుతూహలం, దాన్ని వెన్నంటి రవంత అసూయ లీలగా ఆ కళ్ళలో.

"పేరు వసంతలక్ష్మి. వూరు యిక్కడికి దగ్గరే. పొన్నూరు.... యిక...." ఆశ్చర్యంగా చూశాను. శరీరంలో కలుగుతున్న కంపనాన్ని దాచుకోటానికి ప్రయత్నిస్తోందా అనిపించింది.

"అదేమిటలా అయిపోయారు...." దగ్గరగా వంగి అడిగాను.

అతి ప్రయత్నంమీద సర్దుకుంది. ముఖాన చిన్న చిరునవ్వు దివ్వె వెలిగించింది.

"ఏమీ అయిపోలేదు. నాపేరు వసంత. మా వూరూ.... అదే మీరు చెప్పిన ఆ వూరి ప్రక్కనే.... పేరు నాదే అయ్యేసరికి నా గుండెలో ఏదో అనిర్వచనీయమైన అలజడి రేగి...." తలవంచుకుంది.

తన పేరు పెళ్ళికూతురి పేరుగా వూహించుకునే సరికే స్పందించిన ఆమె వూహలకు జాలివేసింది నాకు. మళ్ళీ ఆమెని నవ్వించాలి.

"అమ్మయ్య! యింత సేపటికి మీ గురించి ఒక్క విషయం బయటకొచ్చింది. అదయినా మూడక్షరాల పేరు మాత్రం. అయితేనేం మీ పేరు చాలా బావుంది...."

"మీరు చూడబోయే పెళ్ళికూతురి పేరు గనుక. కదూ...." అంది.

"కాదు. ఆ కూతురు వసంతలక్ష్మి. రెండేసి, మూడేసి పేర్లు జాయింటుగా కలిపేసి ఒకటిగా పెట్టుకొన్నవాళ్ళంటే నాకు భలే భయం. వాళ్ళ పేర్లలో యిమిడిపోయిన వాళ్ళ అమ్మమ్మల, నాయనమ్మల ఆత్మలు కొద్దిగానయినా వీళ్ళ అంతరంగ ప్రవేశంచేసి అక్కడ అందరూకలసికట్టుగా యిమడలేక, తరాల వైరుధ్యం, భావాల వైరుధ్యం....అబ్బ.. యిక మాటలు దొరకటంలేదండీ సరిగ్గా నా భావం చెప్పటానికి. అందుకే కుటుంబ నియంత్రణ వాళ్ళ స్లోగన్ 'రెండు లేక మూడు' లాగ సరిగ్గా నాకూ 'రెండు లేక మూడు' అక్షరాల పేర్లంటే చాలా యిష్టం. మరి మీ పేరు మాత్రం.... అని మీరడగవచ్చు. మా పెద్దాళ్ళు నాకు పేరు పెట్టేసరికి నేను మరీ మాటలయినా రాని పసిపిల్లాడిని కదండీ. అందుకని

అంతపేరు వద్దని చెప్పలేకపోయాను. ఆ తరువాత మాత్రం నా పేరు 'రాజు.' అంతే. యిక మీ రడిగినప్పుడు అలా పేరును తుంచేసి చెప్పటం మంచిదికాదనిపించి మర్యాదగా పూర్తి పేరు చెప్పాను....” ఎంతో అమాయకంగా ముఖం పెట్టి మాట్లాడుతున్న నన్ను చూసి గలగలా నవ్వింది. నాకు కావలసింది అదే. ఆ నవ్వుని అలా చూస్తుండిపోటంలో ఎంత సమయాన్నయినా గడిపేయవచ్చు. ఆ అమ్మాయి చొరవగా నా చేయందుకుని వాచీ చూసింది.

“అమ్మో! ఎంత టైం ఎంత తొందరగా గడిచిపోయింది మీ మాటలతో. ఇక నాకెంతో టైం లేదు. యింత జాలీగా గడిచిన గంటలు యిప్పటిదాకా రాలేదు. ఇక రావు కూడా. చాలా థాంక్స్ రాజుగారు.

ఇప్పుడు నవ్విన ఆ కళ్ళలో అప్పుడే నీటితెరలు పలుచగా....

“ఇది చాలా అన్యాయం. నా విషయమంతా వినేసి....యిక టైంలేదని మీ గురించి చెప్పకుండా వెళ్ళిపోవాలని చూస్తున్నారు కదూ....” బుంగమూతి పెట్టాను. రెండే రెండు క్షణాలు నా కళ్ళల్లోకి చూసి.... రెప్పలు బరువుగా వాల్చి అంతే.... కమ్ముకున్న నీటితెరలు రెప్పల బరువుకు కదిలిపోయి.... జారిపోయి....బుగ్గలను తడిపి....

“లేదు.... లేదు .... అలా వెళ్ళిపోను.... మానసిక గాయాలు మాన్పి వాటి గుర్తులు చెరిపే మందు యిచ్చేవాళ్ళెవరూ నాకు లేరు. యిక రారు. కాని.... యీ రాత్రి.... మీతో గడిపిన యీ కొద్ది సమయం ఆ గాయాల బాధను మరపింపజేసి.... నాలో మిగిలిపోయింది కరుడుగట్టిన వేదన, కన్నీళ్ళు మాత్రమే కాదని.... చిలిపితనం, పసితనపు నవ్వుల పంటలు నాలోంచి యింకా అదృశ్యమైపోలేదని తెలియచెప్పిన మీ పరిచయం....అలాంటి మీకు.... స్నేహపూర్వకంగా నాలో అదృశ్యమైపోయిందనుకున్న ఆత్మీయత తలుపుతట్టి పలకరిస్తున్న మీకు నా గురించి చెప్పుకోలేకపోతే.... యింకెప్పుడూ.... ఎవరికీ చెప్పుకునే అవకాశం రాదు.... మీలాంటి ఆత్మీయులు నాకు దొరకరు.... కనుక చెప్పేస్తాను.... రాజుగారూ....

“నాపేరు వసంత. నా వయసు యిరవై ఆరు. వయసు మాత్రం నిజం చెప్పరు ఆడవాళ్ళు అనుకోకండి. నాలో యౌవనం ప్రవేశించి, అందమైన ఊహాలోకంలో విహరించటం మొదలుపెట్టి పన్నెండేళ్ళయింది. యీ మధ్యకాలంలో ఆ అందమైన ప్రపంచం నాలాంటి వాళ్ళకి ఊహల్లోనే సాధ్యమని, నిజ జీవితంలో నేను కోరుకుంటున్న జీవితం 'మరీచిక'నే అని నాకు తెలిసిపోయింది. రాజుగారూ! మీ రొక్కటి గమనించాలి యిక్కడ. నేను నా గురించి మాత్రమే మీకు చెబుతాను.

“ఎన్నో సినిమాల్లో, నవలల్లో కనబడే మధ్యతరగతి కుటుంబం మాది. పరిమితి తెలియని తల్లిదండ్రులవటంతో అపరిమిత సంతతి. నేనే పెద్ద. తెలియని ఉత్సాహం మనసుని రంజింపజేస్తూ, గుండెల్లో పులకరింతలు పుడుతూ మనసులో నాకే తెలియని వెచ్చటి కోరికలు తెచ్చాడే వయసు వచ్చినప్పటినుంచే అందరు ఆడపిల్లలలాగే అందమైన కళ్ళలోనే మధురమైన ప్రపంచాన్ని సృష్టించుకుని ఊహల ఉయ్యాలల్లో ఊగి........ఊగి.... అలసిపోయాను. ఊహలతోనే గడిచిపోతున్న కాలాన్ని చూసి విసిగిపోయాను. కనుచూపు మేరలో కనబడని వసంతంకోసం ఎదురుచూసి వేసారిపోయాను. కట్నాల మూట సమ్మరించి పెళ్ళికొడుకుని తేలేని నాన్న నిస్సహాయత, ఎదిగిన కూతుర్ని గుండెలమీద కుంపటిలా భావించి ఆ బాధ తాళాకు మాటల్ని నా మీదకు వెదజల్లే అమ్మ, వంతులవారీగా నా వెనుకే ఒక్కొక్కరూ ఊహల పందిర్లలో చిక్కుకుంటూ ఎదిగివస్తున్న తమ్ముళ్ళు... చెల్లెళ్ళు.... పెళ్ళిఖర్చులు కూడా పెట్టుకోలేని నాన్న సంబంధాలు చూడటం.... బొమ్మలా నేను వాళ్ళకి ప్రదర్శింపబడటం.... కట్నం యిచ్చుకోలేని కారణంగా చెల్లని నాణెంలాగ వాళ్ళు మా సంబంధం విసిరికొట్టటం.... యివన్నీ ముందు హుషారుగా వుండి.... తరువాత మామూలయిపోయి.... రాను రాను బండబారిపోయి నా గుండెల్లో కోరికల్ని కాల్చేసి.... నా హృదయంలో సున్నితత్వాన్నిమాయంచేసేసి....మనిషి, మనసు రాటుతేలిపోయి.... ఓహ్.... ఏదేదో మాటాడుతున్నాను. క్షమించండి బోరుకొడుతున్నానేమో....”అప్పటిదాకా తలవంచుకుని చెబుతున్నదల్లా చప్పున తలెత్తి అంది.

నేను అప్పటిదాకా ఆ ముఖాన్ని.... సన్నగా కంపిస్తూ పలుకుతున్న ఆ పెదవులనే పరికిస్తున్నాను. తలెత్తిన ఆ ముఖంలో ఆ కళ్ళు నిండిన చెరువుల్లాగ, క్షణాలమీద గండి పడబోతున్న చెరువుల్లాగ వున్నాయి.

ఆమె చెబుతున్నది సినిమా రీలులా ఊహించుకుంటూ వింటూండిపోయిన నేను వెంటనే ఏం మాట్లాడలేకపోయాను- మధ్యలో ఆపేయటం అసహనంగా తోచింది.

“అదేం లేదు. మీరు చెప్పండి” అన్నాను ముక్తసరిగా.

“పిలవకుండా వచ్చి మీదపడిన యౌవనం.. చెప్పకుండా పెరిగిపోతున్న వయసు అందరి మనసుల్లోనూ ఆందోళనను పెంచేసింది. నా వెనుకవాళ్ళూ పెరుగుతున్నారు. ఎదుగుతున్నారు. దాంతో అసహనం, నిరాశ, నిస్పృహలు పెంచుకోగలిగారే గానీ పాపం

నాన్న నాకు పెళ్ళికొడుకుని మాత్రం తేలేకపోయారు. గుండెల్లో బాధను నన్ను చూసినప్పుడల్లా నా మీదే కక్కేసే అమ్మ 'కన్నతల్లి' కదా. ముసలాడికీ, మూడో పెళ్ళివాడికీ ఛస్తే యివ్వనంది. యింతలో పాపం నాన్నను యిక మీకు వయసయిపోయింది, శ్రమించలేరుగనుక విశ్రాంతి తీసుకోండి అంటూ వుద్యోగం నుంచి విరమింపజేసి నాన్నను యింటికి పంపేశారు. దాంతో అప్పటికే కుంటినడకలు నడుస్తున్న బ్రతుకులు బొక్కబోర్లా పడ్డట్టయ్యాయి. దాంతో నేను కాస్త ధైర్యంచేసి ముందుకి రాక తప్పలేదు. అమ్మను, నాన్నను ఒప్పించాను. నాకు వయసొచ్చేవరకు మా పెద్దమ్మగారింట్లో పెరిగిన నేను వాళ్ళ చలవవల్ల చదువుతోపాటు సంగీతం నేర్చుకోగలిగాను. చదువు పెద్దగా అబ్బలేదు కానీ సంగీతంలో బాగా రాణించాను. శాస్త్రీయసంగీతం సుమారుగా వంటబట్టింది. పరీక్షలకు కట్టలేదు గానీ బాగా నేర్చుకున్నాను. మా పెద్దమ్మ పోగానే నాన్న యింటికి తీసుకొచ్చేశారు. ఈ సుడిగుండంలో పడ్డాక దిక్కుతోచనిదానిలా అయిపోయాను. అయితే ఆనాటి సంగీతం యీనాడు బ్రతుకు తెరువుగా వుపయోగించుకోవచ్చు ననిపించి, యింట్లో ఒప్పించి ట్యూషన్లు కుదుర్చుకున్నాను" అలసటగా వూపిరి తీసుకుంటూ ఆగింది.


"అయితే యిపేనన్నమాట యీ ట్యూషన్లు...." అనాలోచితంగా అనేసి.... నాలుక కొరుక్కున్నాను.

దెబ్బతిన్న కుక్కపిల్లలా చూసింది. నన్ను నేనే తిట్టుకున్నాను.

"అనాలోచితంగా అనేశాను. క్షమించరూ...." తప్పు ఒప్పుకుంటున్నట్టు చూస్తూ అన్నాను.

"ఎట్లా అన్నా వున్నమాటే అన్నారు" నిర్లిప్తంగా అంది.

బాగా గాయపడింది హృదయం.




ఆడించి, పాడించి వెన్నుపోటు పొడిచాను—

"మరొక్కసారి కోరుకుంటున్నాను క్షమించమని.... ప్లీజ్...."

"మీ రంతగా బాధపడవల్సిందేమీ లేదు రాజుగారూ.... మేమున్న పల్లెటూళ్లో ట్యూషన్లు చెప్పించుకోగల వాళ్ళు ఎవరూ లేరు. అందుకని దగ్గరగా వున్న యీ టౌన్‌కు వచ్చి తెలిసినవాళ్ళను పట్టుకుని సంగీతం ట్యూషన్లు కుదుర్చుకున్నాను. చిన్నపిల్లలకు చదువూ చెప్పవచ్చు ననుకున్నాను గానీ ఈ కాన్వెంటు చదువులు, వాళ్ళ 'మిస్'ల దగ్గరే ట్యూషనులు దీంతో చదువు కుదరలేదు. సంగీతంతోనే సరిపెట్టుకున్నాను. కాని.... కాని.... యిలాంటివి వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా తోడ్పడగలవేగాని.... వేన్నీళ్లు లేనప్పుడు....

"నా కష్టాలన్నీ విన్న ఒక అమ్మాయి తండ్రి నాకు రహస్యంగా సంపాదన మార్గం చెప్పాడు. ఒక్క రాత్రికి.... ఒక్క నెలంతా నేను సంగీతం చెబితే వచ్చే ఒక ట్యూషన్ డబ్బు.... అసహ్యించుకున్నాను.... తిట్టాను.... ఆ అమ్మాయికి ట్యూషన్ మానేశాను. కాని.. హఠాత్తుగా అమ్మకు జబ్బుచేసి.... ఆ గుంటల్లోకి పోయిన కనుగుడ్లు, ఆరటానికి సిద్ధంగా వున్న జ్యోతుల్లా వుంటే.... వైద్యంచేయించటానికి శక్తిలేని నాన్న నిస్సహాయంగా నిలబడిపోతే.... బిక్కుబిక్కుమంటూ నాకన్నా చిన్నవాళ్ళందరూ అమ్మ మంచంచుట్టూ చేరిపోయి భయంగా చూస్తూ నిలబడిపోతే.... నేను.... నేను మానేసిన ట్యూషన్ వెతుక్కుంటూ ఆ యజమానికోసం వెళ్ళాను.... వసంతం రాబోతుందని, కొత్త చిగుళ్ళు తినాలని వువ్విళ్ళూరిన నా గుండెల్లోని కోయిల ఆనాటితో మూగపోయింది. ఆ తరువాతి జీవితమంతా మరుభూమి.... దాన్ని అంటిపెట్టుకుని క్రీనీడలు.... నిస్సారమైన ఎడారిలో పయనిస్తున్నాను. ఎన్నోనాళ్ళకు ఈనాడు.... మీ మాట.... మీ స్నేహం.... నా గుండెని ఆప్యాయంగా.... అమృతపు జల్లులాగా.... స్పృశించి...." ఏడుస్తోంది వసంత. ఆమె గుండెల్లోని వేదన వెల్లువలా దుముకుతోంది.

నాకు ఆపాలని లేదు. అది అలాగ బయటికి వెళ్ళగక్కగలిగితేనే ఆ గుండె తర్వాత తేలికపడేది. తొందరగానే సంబాళించుకుంది.

"అట్లా యిక ఎప్పటికీ నా వూహల ప్రపంచం అందుకోలేని విధంగా నా రెక్కలు నేనే తెగగొట్టుకున్నాను. సంగీతం ట్యూషన్లకని సాయంత్రం నాలుగు

గంటలకి బయలుదేరి వచ్చేసి ఏడుగంటల వరకు ఆ ట్యూషన్లు.... తరువాత పది గంటలవరకు మీరు చెప్పిన ఈ రకం ట్యూషన్లు...." నవ్వింది కళ్ళనీళ్ళతో....

నా గుండెల్లో కలబెట్టినట్టయింది ఆ నవ్వు చూసి. నామాట బాణంలా గుచ్చుకున్న సంగతి తెలుస్తోంది.

"పది ముప్పావుకు మావూరు వెళ్ళే బస్సు వస్తుంది. దాంట్లో వెడితే పావు గంటలో యిల్లు చేరిపోతాను. ట్యూషన్లు చెప్పి అలసిపోయి వచ్చాననుకొని మా అమ్మ ఆదరాబాదరా అన్నం పెడుతుంది. పాటలు పాడి, పాడి గొంతు నొప్పిగా ఉంటుందని యిక ఆ రాత్రికి నాన్న మాట్లాడించరు. నా సంగతి తెలిస్తే వాళ్ళ గుండెలు పగిలిపోతాయి. అందుకే జాగ్రత్తగా కొత్తవూరి నుండి వచ్చిన పాసింజర్లనే చూసుకుంటాను.... యిదీ నా కథ. బస్సు టైం అవుతోంది. మీ ఆదరణకి చాలా కృతజ్ఞురాలిని. నా జీవితంలో మిమ్మల్ని మరచిపోలేను రాజుగారూ...." కంఠం గద్గదంగానే వుంది. కళ్ళు మందారాల్లానే వున్నాయి.

"మరి.... మీ.... మీ డబ్బు...." జేబులోంచి వందనోటు తీసి యిచ్చాను.

"నన్ను ఇలా అవమానించకండి. మీ ఆదరణకి, ఆప్యాయతకి, స్నేహానికి నేను విలువ కట్టదలుచుకోలేదు. మరుభూమిలాంటి నా హృదయంలో మీ పరిచయం మల్లెపూలలాగా అలాగే గుభాళించనీయండి. ప్లీజ్...." నా అరచేతులు తన చేతుల్లోకి తీసుకుని లేచి నిలబడింది.

నాతో చివరగా మళ్ళీ ఆమె నవ్వుని చూడాలని ఒక్క కోరిక.

"ఒక్క సాయం చేయరూ...." అడిగాను.

"ఆజ్ఞాపించండి...."

"మీ వూరుకు దగ్గరే అంటున్నారు కదా ఆ పొన్నూరు. మీకా వసంతలక్ష్మి తెలుసా? వాళ్ళ నాన్నగారి పేరు పురుషోత్తంగారు. రిటైర్డు టీచరు...." ఆమెనే చూస్తున్నాను. నవ్వటంలేదు.... నిస్తేజంగా చూస్తోంది....

"దయచేసి మీకు తెలిసివుంటే ఆ వసంతలక్ష్మి ఎలా వుంటుందో చెప్పరూ.... 'పర్వతవర్ధిని లాగానో.... సులోచనముల ధారిణియో.... మీకు నా మీద దయవుంటే నిజం చెప్పేయండి ప్లీజ్. పగలు చూస్తే రాత్రి కలలోకివచ్చి జడిపించి.... లేదా చూడగానే గుండెలవిసిపోయే ఏ కాష్మోరా బొమ్మలాగోనో.... బాబోయ్.... మీరు చెప్పేస్తే.... నేను తెల్లవారకుండా మావూరు బస్సు ఎక్కేస్తాను.... పుణ్యం కట్టుకోరూ...." బ్రతిమాలుతున్న భంగిమ పెట్టాను.

ప్రవహించింది గలగలా....జలజలా.

నాకు కావలసింది అదే.... చివరగా నేను చూడాలనుకుంది ఆ నవ్వే....

"నిజంగా.... నాకు తెలీదు.... కాని ఒకటి మాత్రం బాగా తెలుసు. వాళ్ళు ఎర్రని ఏగాని కట్నంకూడా యివ్వలేరు. యీ కారణంగా కూడా మీరు అమ్మాయిని చూసే శ్రమనుండి తప్పుకుని తెల్లవారకుండా మీ వూరు బస్సులో చెక్కేయవచ్చు...."

మళ్ళీ అదే నవ్వు....

యీ సారి నాకు కోపం వచ్చింది.

"అదేం....ముఖం అలా పెట్టారు...." ముందుకు వంగి అడిగింది.

"రాత్రంతా రామాయణం విని.... అన్నట్టుంది మీ వ్యవహారం. కట్నం లేకుండా చేసుకోవాలనుందండీ... పిల్ల మాత్రం నచ్చాలీ అని మొదటనుంచీ చెబుతూనే వున్నా...." బుంగమూతి పెట్టాను.

"క్షమించండి రాజుగారూ.... మీ మంచి మనసుకి నా జోహార్లు.... మీరందించిన యీ కొన్ని గంటల స్నేహానికి చాలా థాంక్స్.... వస్తాను...."

'వస్తాను' అన్నమాటతో గిర్రున తిరిగి చకచకా వెళ్ళిపోయింది. 'అయ్యో' చివరగా సరిగ్గా వీడ్కోలు చెప్పినట్టు లేదు నేనుకూడా.... పాపం బస్ టైమ్ అయిపోయింది కాబోలు.... తననే తలుచుకుంటూ సిగరెట్ వెలిగించి.... పొగ రింగులు రింగులుగా వదుల్తూ.... ఆ రింగుల్లో గిర్రున తిరుగుతూ ఆ అమ్మాయి జీవితం.... అరగంట గడిచినట్లుంది.

"సార్...." హోటల్ కుర్రాడు.

"ఆ అక్క మీకు యిమ్మంది."

చప్పున లేచి కూర్చుని కాగితం అందుకున్నాను. అక్షరాల వెంట చకచకా పరుగెత్తాయి నా చూపులు.

"రాజుగారికి,

నమస్కారములు. వెనువెంట క్షమాపణలు. మీరు చూడబోయే వసంతలక్ష్మి నాకు తెలుసు. అందుకనే నే చెప్పేదేమంటే మీరు తెల్లవారకుండానే మీ వూరు బస్సు ఎక్కేసి చెక్కేయండి. సార్.... మీలాంటి ఒకరు కొన్నాళ్ళ ముందుగా నాకు తటస్థపడిఉంటే.... నా బ్రతుకు ఇలా ముళ్ళబాటలోపడి చిందరవందర అయ్యేది కాదు. నాకా అదృష్టం లేదు. నాలాంటి జీవితాలు ఇంకా కొన్ని తయారుకాకుండా వెలుగులు చిమ్మాలనుకుంటే మీలాంటి ఎందరో యింకా యింకా ముందుకు రావాలి. ఆ అదృష్టం కొందరికయినా దక్కాలి. మీరు రేపు పెళ్ళిచూపులకు రానక్కరలేదు. ఆ వసంత పశువులు తొక్కేసిన మల్లెతీగ. రేకు వాడిపోయిన గులాబి. నీకెలా తెలుసంటారా? ఆ వసంతలక్ష్మిని నేనే సార్. ఆ దురదృష్టవంతురాలిని నేనే.... కొన్నాళ్ళ ముందు వచ్చివుంటే మీ పాదాలమీద వాలిపోయేదానిని.... అన్ని అర్హతలూ కోల్పోయిన నిర్భాగ్యురాలిని యిప్పుడు....మీ రందించిన ఆత్మీయతని మాత్రం నా గుండెల్లో పదిలంగా దాచుకుంటాను. వుంటాను సార్. బస్



వస్తోంది. మీకు మంచి అమ్మాయి భార్యగా రావాలని కోరుతూ....

నిర్భాగ్యురాలు

వసంత.

షాక్ తిన్నాను.... సిగరెట్ ఆరిపోయింది. రింగులు గాలిలో కలిసిపోయాయి.

* * *

మసక వెలుతురులో ముగ్గులేస్తున్న వసంత ఒక్కసారి తలెత్తి చూసింది. ఆమె కళ్ళనిండా కొండంత ఆశ్చర్యం.... భయంగా లేచి నిలబడింది. ముగ్గుబుట్ట నేలజారిపోయి తెల్లగా.... ముగ్గంతా....

"వసంతలక్ష్మిగారూ.... పెళ్ళిచూపులకు వచ్చాను...." నవ్వుతూ అన్నాను. ఏదో చెప్పబోయింది.... మాట రాలేదు.

"మీరేం చెప్పొద్దు. నేను మీకోసం వచ్చాను. కట్నం లేకుండా నాకు నచ్చిన అమ్మాయి యిన్నాళ్ళకు దొరికింది.... మరి నేను లోపలికి రావచ్చా పెళ్ళికూతురుగారూ...."

విభ్రమం.... యింకా తేరుకోలేదు. కలా.... నిజమా.... ఎన్ని భావాలు ఆ కళ్ళలో....

"సరే! నేనే తీసుకువెడతాను.... మరి ఏంచేస్తాం రండి అమ్మాయిగారూ...." చేయి పట్టుకున్నాను.

నా ముఖంలోకే చూస్తోంది.... ఆ కళ్ళనిండా నీళ్ళు.... అవి ఆనంద భాష్పాలా.... ఆ ముఖం.... వాన కురిసిన రాత్రి తరువాతి సూర్యోదయంలాగా.... అందంగా.... మెరుస్తూ....

కొత్త పెళ్ళికూతురిలాగానే.... నడిచింది నాతో లోపలికి.... వసంత. ఎడారిలో కోయిల పాయబోతోంది. నాకు తెలుసు.

✲